రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (శుక్రవారం సాయంత్రం) సహర్: 4:44 (శనివారం ఉదయం)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 28 మార్చి 2025

కుప్పకూలిన పర్యవేక్షణ


శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం


ఉపేందర్ ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ గాలింపు


కామేశ్ మృతదేహం


కామేశ్ (ఫైల్)

భద్రాద్రిలో విషాదం

బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మేస్త్రీల దుర్మరణం

భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. శిథిలాల్లో చిక్కుకున్న ఇద్దరు మేస్త్రీలు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రమాదం జరగ్గా రెస్క్యూ బృందాలు అర్ధరాత్రి 1.45 గంటలకు శిథిలాల నుంచి కామేశ్వరరావు అలియాస్ కామేశ్‌ను ప్రాణాలతో బయటకు తీసి ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా కామేశ్ మృతి చెందినట్టు వైద్య వర్గాలు ప్రకటించాయి.

మరోవైపు గురువారం ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి కాలరీస్, తెలంగాణ ఫైర్ డిజాస్టర్స్ రెస్క్యూ ఫోర్స్ బృందాలు శిథిలాల్లో చిక్కుకున్న మేస్త్రీ పడిచాల ఉపేందర్‌రావు ఆచూకీ కోసం భవనం శిథిలాల తొలగింపును కొనసాగించాయి. గురువారం సాయంత్రం సమయంలో శిథిలాల కింద రెస్క్యూ సిబ్బందికి దుర్వాసన రావడంతో ఆ ప్రాంతంలో ఉపేందర్‌రావు మృతిచెంది ఉంటారని భావించి, మిషన్లతో తవ్వకాలు నిలిపివేసి తొలి రోజున చేసినట్లు కింది నుంచి తవ్వుకుంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం మొదలుపెట్టారు. మిషన్లతో ప్రయత్నిస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే భావనతోనే ఈ ప్రయత్నం ఆరంభించారు. చివరకు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉపేందర్‌రావు ఆచూకీ లభించింది. శిథిలాల కింద ఆయన విగతజీవిగా కనిపించారు. అధికారులు నిర్ధారించిన వెంటనే అక్కడే వున్న ఉపేందర్‌రావు కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

- మొదట మేస్త్రీ ఆచంట కామేశ్వరరావు గుర్తింపు
- 11 గంటలు ప్రయత్నించినా దక్కని ప్రాణం
- రెండో రోజూ కొనసాగిన గాలింపు చర్యలు
- అర్ధరాత్రి దాటిన తర్వాత విగతజీవిగా కనిపించిన మేస్త్రీ ఉపేందర్‌రావు
- శోకతప్తమైన బంధువులు

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో భవనం కూలిన ఘటలో బుధవారం అర్ధరాత్రి తర్వాత మేస్త్రీ ఆచంట కామేశ్వరరావు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో శిథిలాల్లో చిక్కుకుపోయిన మరో మేస్త్రీ ఉపేందర్‌రావుకోసం అధికారులు గాలింపులు ముమ్మరం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం అర్ధరాత్రి వరకు నిరంతరాయంగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించారు. గాలింపు చర్యలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఆర్డీవో దామోదర్‌రావు, భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, విజయవాడ టెన్త్ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సుకేంద్‌దత్తా దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, భద్రాచలం డీఎల్‌పీవో సుధీర్, సీఐ బరపాటి రమేష్, తహసీల్దార్ శ్రీనివాసరావు సైతం అక్కడే వున్నారు. చివరకు అర్ధరాత్రి తర్వాత ఉపేందర్‌రావు మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. కాగా, ఘటన ప్రాంతంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి శిథిలాల వద్దకు ఎవరూ రాకుండా చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో సైతం గాలింపు చర్యలు చేపట్టేందుకు రెండు రోజులుగా ఫ్లడ్‌లైట్లను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శిథిలాలు తొలగిస్తుండగా ఒక లాకర్, కొన్ని పత్రాలు లభించాయి. సిబ్బంది వాటిని స్టేషన్‌కు తరలించి భద్రపరిచినట్లు పోలీసువర్గాలు తెలిపాయి.

మృతులు ఇద్దరేనా..?

భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం కూలిన ఘటనలో ఊహించినట్టుగానే మేస్త్రీలు కామేశ్, ఉపేందర్‌రావు మృతి చెందారు. (మిగతా 6వ పేజీలో)

అభ్యంతరాలను ఖాతరు చేయని శ్రీపతి

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- పంచాయతీ ఈవో హెచ్చరించినా మారని తీరు
- పోలీసుల అదుపులో శ్రీపతి దంపతులు
- ఇంకా ఫిర్యాదు చేయని బాధిత కుటుంబాలు


శ్రీపతి

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిన ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ నిర్మాణం చేపట్టిన శ్రీపతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాడు. ఇతను ఎవరు? నిబంధనలను ఖాతరు చేయకుండా భారీ భవన నిర్మాణాన్ని ఎలా చేపట్టాడు..? స్థానికులు, అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా నిర్మాణాన్ని ఎలా కొనసాగించాడు? ఇతని వెనుక ఎవరైనా పెద్దలున్నారా..? అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భద్రాచలం ప్రధాన కేంద్రంగా శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టు శ్రీవిజయ కనకదుర్గ భవానీ దేవస్థానం పేరిట ఉన్న ఆలయం నిర్వహిస్తున్నది ఎవరు అనే దానిపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. సదరు ట్రస్టు నిర్వాహకుడిగా ఉన్న శ్రీపతి నేపథ్యం గురించి పూర్తి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈయనకు ఏపీలోని ఒక సేవా సంస్థతో ఉన్న అనుబంధం ఉన్నట్టు వినికిడి. గతంలో (మిగతా 6వ పేజీలో)

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి...

- ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి
- రాజకీయ పార్టీల నేతల డిమాండ్

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయపార్టీలు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించి 1/70కి విరుద్ధంగా అనుమతి ఇచ్చిన ఈవోను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రావులపల్లి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో బృందం బాధితులను పరామర్శించారు. నష్టపోయిన బాధితులకు తగిన పరిష్కారం చూపాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రామ్‌ప్రసాద్ కోరారు. ప్రతి కుటుంబానికి (మిగతా 6వ పేజీలో)


మిర్చి కల్లంలో నిరసన తెలుపుతున్న రైతు నాగేశ్వరరావు

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించండి..

- మిర్చి కల్లంలో కూర్చొని రైతు వినూత్న నిరసన

ఖమ్మం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రతి రైతుకు రూ.2లక్షల రుణ మాఫీని వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా రూరల్ మండలం, కస్నాతండాకు చెందిన భూక్యా నాగేశ్వరరావు అనే రైతు తన మిర్చి కల్లంలో కూర్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. మెడలో మిర్చి దండ వేసుకుని, చేతిలో ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా రైతు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి (మిగతా 6వ పేజీలో)

'మక్క' కొనుగోళ్లకు కసరత్తు


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మొక్కజొన్నలు

- వచ్చే నెల మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా 44 కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 29న రవాణా టెండర్లు ముగియగానే కార్యాచరణ
- కొనుగోలు లక్ష్యం 40 లక్షల క్వింటాళ్లు
- మద్దతు ధర క్వింటాలుకు రూ.2,225

ఖమ్మం మార్కెట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నల ధరలు రోజు రోజుకు పడిపోవడంతో మక్క రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదేశాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సుమారు 44 కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నోటిపై చేయగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 11 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది భద్రాద్రి జిల్లాలో సుమారు 32వేల ఎకరాలు, ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్షా 10 వేల ఎకరాలకు పైగా మక్క పంటను సాగు చేశారు.

ఈ క్రమంలో గత రెండు, మూడు నెలలుగా కోళ్ల ఫారాలకు బర్డ్‌ఫ్లూ లాంటి వైరస్‌లు రావడంతో చాలావరకు కోళ్ల ఫారాలు మూతపడ్డాయి. దీంతో మక్కలకు ఈ ఏడాది డిమాండ్ తగ్గి మద్దతు ధర కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఒక వేళ కోళ్ల ఫారాలకు మక్కల సరఫరా ఆగిపోతే వారు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం ఉంది. ఇది గమనించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మొక్కజొన్నలకు నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాలు రూ.2,225లకు కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించింది. కాగా మక్కలకు ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1,900ల నుంచి రూ.2,000ల వరకు మాత్రమే దక్కుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు సంస్థ అయిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రంగంలోకి దిగితే మక్క రైతుకు మద్దతు ధర దక్కే అవకాశం ఉంది.

ఊపిరి పీల్చుకున్న రైతులు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సుమారు లక్షా 42వేల ఎకరాలకు పైగా మక్కలను సాగు చేసిన రైతులకు త్వరలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. మక్కలకు ఫౌల్ట్రీ, (మిగతా 6వ పేజీలో)

'బార్' అధ్యక్షుడిగా 'తొండపు'

- ప్రధాన కార్యదర్శిగా గద్దల దిలీప్ కుమార్
- హోరాహోరీగా జరిగిన ఎన్నికలు


అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు


ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్

ఖమ్మం లీగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది తొండపు వెంకటేశ్వరరావు గెలుపొందారు. తల్లాడ మండలం వెంగన్నపేట గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు సాధారణ రైతు కుటుంబానికి చెందినవ్యక్తి. న్యాయశాస్త్రంలో నాగార్జున యూనివర్సిటీ నుంచి 1990లో పట్టా పొందారు. అదే సంవత్సరం ఉమ్మడి రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. ఖమ్మానికి చెందిన సీనియర్ న్యాయవాది బోడేపూడి వెంకటేశ్వరరావు దగ్గర జూనియర్‌గా పనిచేశారు.

కాగా, జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తం 816ఓట్లకు గాను 719 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ పడగా ఇద్దరి మధ్యనే ప్రధాన పోటీ జరిగింది. ఎన్నికల్లో తొండపు వెంకటేశ్వరరావు తన ప్రత్యర్థి ఎస్.వెంకటేశ్వరరావు గుప్తాపై 168ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన విజయశాంత 6ఓట్ల మెజారిటీతో జానీపై గెలుపొందారు.

ప్రధాన కార్యదర్శిగా గద్దల దిలీప్‌కుమార్ 39ఓట్ల మెజారిటీతో తెల్లాకుల బాబుపై గెలుపొందారు. క్రీడా కార్యదర్శిగా కె.వి.వి. లక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్.రాంబాబు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సర్వదేవభట్ల సోమశేఖర్ శర్మ ప్రకటించారు. ఫలితాల అనంతరం న్యాయవాదులు సంబురాలు చేసుకున్నారు. నూతన కార్యవర్గానికి సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అభినందనలు తెలిపారు. న్యాయవాద సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపారు. జాయింట్ సెక్రటరీగా ఎం.నవీన్ కుమార్, ట్రెజరర్‌గా పి.నర్సింహరావు, మహిళా ప్రతినిధిగా పి.ఇందిర గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సీఎంకు మంత్రి, ఎమ్మెల్యేల కృతజ్ఞతలు...

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ.34 కోట్ల నిధులు కేటాయించటం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్యతో కలిసి ఆయన హైదరాబాద్‌లో గురువారం సీఎంను కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. వీరివెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు కోనేరు సత్యనారాయణ, తాళ్లపల్లి రమేష్‌గౌడ్ వున్నారు.

-ఆంధ్రజ్యోతి, భద్రాచలం

ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు



- లక్ష్యం రూ.100 కోట్ల పైనే...
- ఇప్పటికి వచ్చింది రూ.35 కోట్లే..
- రాయితీకి గడువు ఈ నెల 31వరకే
- నిబంధనలపై దరఖాస్తు దారుల్లో అస్పష్టత
- 'సుడా' పరిధిలో నత్తనడకన ప్రక్రియ

ఖమ్మం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్ఆర్ఎస్ ద్వారా ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం ఒకవైపు కుస్తీపడుతున్నా.. జిల్లా స్థాయిలో గ్రామ పంచాయతీలు, స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నత్తనడకన నడుస్తోంది. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా జరుగుతున్నా.. మండలాల్లో మాత్రం ఆశించిన మేర దరఖాస్తుదారులు ముందుకు రావడంలేదు ప్రభుత్వం 25శాతం రాయితీ ప్రకటించి త్వరగా ఎల్ఆర్ఎస్ ద్వారా ఆదాయం పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం ఇచ్చిన 25శాతం రాయితీ గడువు ఈనెల 31 వరకు మాత్రమే ఉంది. జిల్లా నుంచి సుమారు రూ.100కోట్లపైనే ఎల్ఆర్ఎస్ ఆదాయం లభిస్తుందని అధికారులు అంచనా వేసినా ఇప్పటి వరకు జిల్లానుంచి రూ.35కోట్లు మాత్రమే ఆదాయం లభించింది.

జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం లక్షా8వేల మంది దరఖాస్తు చేయగా, 7,829మంది మాత్రమే ఎల్ఆర్ఎస్ సొమ్ములు చెల్లించారు. 68 వేల దరఖాస్తులకు ఎల్ఆర్ఎస్ కట్టుకోవచ్చని ఆన్‌లైన్‌లో క్లియరెన్సు ఇచ్చారు. మిగిలిన 32వేల దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. చెరువు శిఖం భూములు, మున్నేరు బఫర్‌జోన్‌తో పాటు పలుచోట్ల వాగులు, చెరువు శిఖాలు, ప్రభుత్వ భూముల్లో కూడా వెంచర్లు వేసి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. వీటన్నింటిని పెండింగ్‌లో ఉంచారు. కొన్నిచోట్ల పదిశాతం కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అలాగే గ్రీన్‌బెల్ట్‌కు ల్యాండ్ తీయకపోవడంతో వాటికి అభ్యంతరాలు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్లాట్లకు ఎంత కట్టాలో వివరాలు లేకుండా పెండింగ్‌లో ఉంచితే సంబంధిత మండల, కార్పొరేషన్ అధికారులను సంప్రదిస్తే పెండింగ్ విషయాలను దరఖాస్తుదారులకు అధికారుల నుంచి ఫోన్ల ద్వారా చెప్పకపోవడం, ఆ పెండింగ్‌కు గల కారణాలను వివరించకపోవడంతో చాలామంది దరఖాస్తుదారులు గందరగోళంలో ఉన్నారు. అధికారులు దరఖాస్తుదారులందరికీ పెండింగ్ క్లియరెన్సుకు చేపట్టాల్సిన చర్యల గురించి కావాల్సిన పత్రాల గురించి తెలియచేస్తే ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మరింత వేగంగా ముందుకు పోయే పరిస్థితి ఉంది. జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (మిగతా 6వ పేజీలో)



మరో రెండు రోజులే
గడువు

- ఇప్పటివరకు రూ.24.69 కోట్ల ఆదాయం
- కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర

ప్రశ్న: ఖమ్మం నగరంలో ఎన్ని ఇళ్ల స్థలాలకు క్రమబద్ధీకరణ చేశారు?

జవాబు: నగర పాలక సంస్థ పరిధిలో 21,684ఇళ్ల స్థలాలు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అర్హత పొందాయి. వాటిలో 3,989 దరఖాస్తులు ఫీజులు చెల్లించారు. 2,133 దరఖాస్తులకు ప్రొసిడింగ్స్ పంపిణీ జరిగింది. ఇప్పటివరకు రూ.24.69 కోట్ల ఆదాయం సమకూరింది.

ప్ర: తుదిగడువు ఎప్పటి వరకు ఉంది?

జ: మరో రెండు రోజులు(ఆది, సోమ సెలవులు)ఈనెల 31తో గడువు ముగుస్తుంది. ఫీజు చెల్లించమని సమాచారం వచ్చిన ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. ఐజీఆర్ఎస్ సమాచారం అందిన వారు కూడా ఫీజు చెల్లించేందుకు ఆన్‌లైన్ అవకాశం కల్పించారు. ఎఫ్‌టీసీ (ప్రొహిబిటెడ్ ప్రాంతం) వారుమాత్రం ఇప్పుడు ఎల్ఆర్ఎస్ చేయించటానికి అవకాశం లేదు. ఖమ్మం నగరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల మేరకు కౌంటర్లు ఏర్పాటు చేయటం జరిగింది. రూ.లక్ష వరకు డిజిటల్ పేమెంట్స్ చేయవచ్చు.

ప్ర: అదనంగా ఫీజు సమాచారంపై?

జ: స్థలం వ్యాపించి ఉన్న ప్రాంతం వరకు మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజులు ధరలు నిర్ణయం ఉంటుంది. కొన్ని ఇళ్ల స్థలాలకు ఎక్కువగా ఫీజు వచ్చాయనే వాటిపై తిరిగి ఆన్‌లైన్‌లో మార్పులు చేశారు. అటువంటి వారు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదిస్తే వారికి సరైన సూచనలు ఇవ్వటం జరుగుతుంది.

ప్ర: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు కాల్ సెంటర్?

జ: ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల సంఖ్యలో దరఖాస్తుదారులకు అవగాహన కల్పిస్తున్నాం. 63095 03833 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి పూర్తిస్థాయిలో వివరాలు పొందవచ్చు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం

బిల్లులు రాక.. వైద్యానికి డబ్బులు లేక...

- ఓ ఉపాధ్యాయుడి భార్య మృతి..
- పాడె మోసి పీఆర్‌టీయూ నాయకుల నిరసన

పాల్వంచ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సకాలంలో జీపీఎఫ్ బిల్లులు రాక వైద్యానికి చేతిలో డబ్బులు లేకపోవడంతో ఓ ఉపాధ్యాయుడి కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. జీపీఎఫ్ డబ్బులు ప్రభుత్వం మంజూరుచేయకపోడవం వల్లే ఉపాధ్యాయుడి భార్య మృతిచెందిందని ఆరోపిస్తూ పీఆర్‌టీయూ యూనియన్ నాయకులు మృతురాలి పాడె మోసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే పాల్వంచ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పొదిలి సత్యనారాయణ భార్య లత(51) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందింది. మెరుగైన వైద్యం కోసం జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ సరెండర్ లీవ్‌ల డబ్బుల కోసం విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏడాది కాలంగా డబ్బులు రాకపోవడంతో అప్పులు తెచ్చి వైద్యం చేయిస్తూ వస్తున్నారు. 15రోజుల క్రితం అధికారులకు తమ పరిస్థితిని మొరపెట్టుకున్నారు. కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకోలేక నిస్సహాయ పరిస్థితుల్లో ఇంటి వద్దనే వైద్యం చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతిచెందింది. దాచుకున్న డబ్బులు అవసరాలకు అందక ఆ ఉపాధ్యాయుడి భార్య మృతిచెందిందని పీఆర్‌టీయూ యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

మండుటెండలో నిరసన..

ఉపాధ్యాయుడు పొదిలి సత్యనారాయణ భార్య మృతి చెందడంతో మండుటెండలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేశారు. జీపీఎఫ్ నిధులు ఇవ్వకపోవడం వల్లే ఆమెకు వైద్యం చేయించలేకపోయారని తెలిపారు. పీఆర్‌టీయూ నేతృత్వంలో తహసీల్దార్ వివేక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం లత మృతదేహాన్ని సందర్శించి ఆమె పాడె మోసి నిరసన తెలిపారు. ఆ కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు(డీవీ) రవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీ.శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, అసోషియేట్ అధ్యక్షుడు సంగమేశ్వర రావు, ఏంఈవో శ్రీరాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఓసీలో సినిమా చిత్రీకరణ

ఓసీలో హరిహర వీరమల్లు షూటింగ్

ఇల్లెందు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే 5 ఓసీలో గురువారం హరిహర వీరమల్లు సినిమా షూటింగ్‌ను జరిగింది. సైడ్ యాక్టర్లపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్రయూనిట్ సభ్యులతో ఓసీ ప్రాంగణం, క్వారీలో కోలాహలం నెలకొంది. సినిమా డైరెక్టర్ జ్యోతికృష్ణనిర్మాత ఎఎం.రత్నంలతోపాటు పలువురు చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు. సింగరేణి యాజమాన్యం షూటింగ్ నిర్వహణకు ఓసీలో పలు ఏర్పాట్లను చేసింది. సింగరేణి అధికారులు సినిమా షూటింగ్‌ను పర్యవేక్షించారు.

'ఫిత్రా' పేదల హక్కు

రంజాన్‌లో ప్రతి ముస్లిం నిరుపేదలకు దానం చేయాలి



అంధుడుకి ఫిత్రాదానం చేస్తున్న చిన్నారులు

కల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) రంజాన్ మాసంలో ఫిత్రాదానం విధిగా పేదల హక్కుగా భావిస్తారు. సమాజంలో ఆకలి బాధలతో, నివాస యోగ్యం లేనివారు, కడుపేద వారికి ఆర్థికంగా చేయూత ఇవ్వటం, దైవంపై విశ్వాసం కలవారు చేయదగిన కర్తవ్యం. అంతిమ గ్రంథం ఖుర్ఆన్ అవతరించిన పవిత్ర మాసం రంజాన్ నెలలో ఫిత్రా (దానం) ఇస్తారు. ఫిత్రా అనే పదం ఇఫ్తార్ నుంచి వచ్చింది. ఫిత్ర్ అంటే శాబ్దిక అర్థం. రోజా (ఉపవాసం) ముగింపు అని అర్థం. సదఖయే ఫిత్ర్ అంటే ధర్మశాస్త్ర పరిభాషలో ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగే లోటుపాట్లకు పరిహారంగా పవిత్ర రమజాన్ నెలలో తప్పనిసరిగా నిర్ణయించిన దానం అన్నమాట. పండుగకు ముందుగా పేదలకు చెల్లించే ఫిత్రా దానం అల్లాహ్ దృష్టిలో స్వీకృత ఫిత్రాగా పరిగణిస్తారు. ఫిత్రా ఇవ్వగల ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఉన్నా.. లేకపోయినా.. ఫిత్రా దానం పేదలకు తప్పని సరిగా ఇవ్వాలి. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అంత మంది తరపున ఫిత్రా చెల్లించాలి. చివరికి అప్పుడే పుట్టిన శిశువు తరపున కూడా వారి సంరక్షకులు ఫిత్రా దానం చెల్లించాలి. దైవప్రవక్త మహ్మద్ ఇలా చెప్పాడు. ఫిత్రా దానం చెల్లించి మీ ఉపవాసాన్ని పవిత్రం చేసుకొండి. పేదలను సంతోషంగా ఉండేలా చూడాలని ఉపదేశించాడు. ఆ ప్రకారం ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించు కొని నిరుపేదలకు, అభాగ్యులకు సగటున ఫిత్రాదానం రూ.100 చెల్లిస్తున్నారు. ఇప్పటికే కల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రతి ముస్లిం కుటుంబంలో ఉన్న సభ్యులు తమ వంతుగా ఫిత్రాదానం పంపిణీ చేశారు.

టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా 'బాగం'

- రెండో సారి ఏకగీవ్రంగా ఎన్నిక
- నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలో ప్రకటన
- అభినందించిన జిల్లా నాయకులు



బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 25, 26, 27న నిజామాబాద్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. మహాసభల ముగింపు రోజున గురువారం రాష్ట్ర అధ్యక్షుడిగా బాగం హేమంతరావును రాష్ట్ర సమితి ఏకగ్రీవంగా ప్రకటించింది.

నేలకొండపల్లి మండలం ముఠాపురంలో రైతు కుటుంబంలో జన్మించిన బాగం హేమంతరావు సాధారణ కార్యకర్త నుంచి జాతీయ సమితి సభ్యుడి వరకు భారత కమ్యూనిస్టు పార్టీలో క్రమశిక్షణతో ఎదిగారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఎక్కువ అసెంబ్లీ స్థానాలు పార్టీ గెలుపొందింది. రైతాంగ సమస్యలపై పోరాటాలు చేశారు. దీంతో రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండో సారి అవకాశం దక్కింది.

ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ రైతుల పక్షాన పోరాటాలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ వ్యతిరేక విధానాలపై, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించటానికి పోరాటాలు చేస్తామన్నారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావులు రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

కేఎంసీకి ఒకే రోజు రూ.81.50 లక్షల ట్యాక్స్ కలెక్షన్

రూ.28 కోట్లకు చేరిన కేఎంసీ ఆదాయం



ట్యాక్స్ వసూళ్లను పరిశీలిస్తున్న ఏఎంసీ షఫీ ఉల్లా

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ ట్యాక్స్ కలెక్షన్‌లో సరికొత్త రికార్డును గురువారం నమోదు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌లో వడ్డీపై 90 శాతం మాఫీని ప్రకటించింది. దీంతో ట్యాక్స్ కలెక్షన్ అనూహ్యంగా పెరిగింది. ఒకే రోజు రూ.81.50 లక్షల ఆదాయ వసూళ్లు జరిగాయి. దీంతో కేఎంసీ ఆదాయం రూ.28 కోట్లకు చేరింది.

మధిర బార్ అధ్యక్షుడిగా పుల్లారావు



పుల్లారావును అభినందిస్తున్న న్యాయవాదులు

మధిరటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బోజెడ్ల పుల్లారావు విజయం సాధించారు. గురువారం మధిర కోర్టు హాల్‌లో జరిగిన ఎన్నికల అనంతరం జరిగిన కౌంటింగ్‌లో పుల్లారావు తన ప్రత్యర్థి పల్లపోతుల కృష్ణారావుపై ఏడు ఓట్లతో గెలుపొందారు. మొత్తం 31ఓట్లు పోలవ్వగా పుల్లారావుకు 19ఓట్లు రాగా.. కృష్ణారావుకు 12 ఓట్లు వచ్చాయి. పుల్లారావు అధ్యక్షుడిగా విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వెంకట్రావు తెలిపారు, అధ్యక్ష స్థానానికి మినహ మిగతా అన్ని పదవులు ఏకగ్రీవం అయ్యాయి, పుల్లారావు బార్ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది మూడోసారి. కాగా ఇంతకుముందు రెండు సార్లు ఏకగ్రీవంగా గెలుపొందగా ఈ సారి ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. నూతన అధ్యక్షుడిని న్యాయవాదులు వాసంసెట్టి కోటేశ్వరరావు, కట్టా పూర్ణచందర్ రావు, వానిరెడ్డి వెంకటేశ్వరరావు, మోహన్‌దాస్, జగన్మోహనరావు తదితరులు అభినందించారు.

సత్తుపల్లి బార్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



సత్తుపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపూల వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా మహదేవ జనార్ధనాచారిలు ఎన్నికయ్యారు. గురువారం సత్తుపల్లి కోర్టులో ఎన్నికలు నిర్వహించారు. కాగా ఉపాధ్యక్షుడిగా కేశన శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా సాదు కృష్ణ, లైబ్రరీ సెక్రటరీగా నల్లగట్ల విజయకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా జేవీ.నరేంద్ర, ఈసీ మెంబర్లుగా ఇనపాల నరసింహారావు, గుంట్రు శ్రీనివాసరావులు ఇదివరకే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను న్యాయవాదులు, సిబ్బంది అభినందించారు.

'మక్క' కొనుగోళ్లకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ఆహార ఉత్పత్తుల రంగంలో డిమాండ్ ఉన్నప్పటికీ ధర దక్కక పోవడంతో మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా మొక్కజొన్న పంట సాగు నుంచి హార్వెస్టింగ్ వరకు అక్కడ్నుంచి మార్కెట్‌కు రవాణా వరకు సుమారు రూ.60 వేల నుంచి రూ.65 వేల వరకు పెట్టుబడి ఖర్చులు కాగా ఆ ఎకరాలో వచ్చే దిగుబడి సుమారు 30క్వింటాలకు గాను క్వింటాలుకు రూ.1900 నుంచి రూ.2,000 చొప్పున మొత్తం రూ.55,000 నుంచి రూ.60 వేల వరకు దక్కుతున్నాయి. దీంతో మక్కలను సాగు చేసిన రైతులకు లాభం రాకపోగా ఎకరాకు సుమారుగా రూ.5 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225 లకు కొనుగోలు చేసినట్లైతే పెట్టుబడి ఖర్చులు పోను ఎకరాకు రూ. 5 వేల వరకు మిగులు ఉండే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు

పి.సునీత, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి

ప్రసుత్తం మార్కెట్‌లో మక్కలకు కనీస మద్దతు ధర క్వింటాలు రూ.2,225 లభించడం లేదు. దీంతో ప్రభుత్వానికి మా ఉన్నతాధికారుల ద్వారా నివేదికలు సైతం పంపాము. ప్రభుత్వం నుంచి వచ్చే నెల మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఆదేశాలు వచ్చాయి. ఖమ్మం జిల్లాలో 44 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. మక్క రైతులు వారి పంటను 14 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. అప్పుడే వారికి ఎంఎస్పీ ధర రూ.2,225 దక్కుతుంది.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖమ్మంమార్కెట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్టు మార్కెట్ సెక్ర టరీ ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న శనివారం అమావాస్య సందర్భంగా, 30న ఆదివారం ఉగాది పండుగ, 31న సోమవారం రంజాన్ పండుగ, ఏప్రిల్ 1న మంగళవారం రంజాన్ మరుసటి రోజు సెలవుల కారణంగా వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్టు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఏప్రిల్ 2న బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని మండలాల్లో ఇతర గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తు చేశారు. ఖమ్మం కార్పొరేషన్ ఏరియాలో ఎల్ఆర్ఎస్ ఆవశ్యకత గుర్తించి ప్లాటుదారులు, రియల్ ఎస్టేట్ యజమానులు దరఖాస్తుదారులను చైతన్యపరిచి ఎల్ఆర్ఎస్ కట్టిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ కట్టడం ద్వారా చట్టపరంగా, న్యాయపరంగా ప్లాట్లపై యజమానులకు పూర్తిస్థాయి హక్కులు లభిస్తాయి. అయితే ఎల్ఆర్ఎస్ పెండింగ్ కేసుల విషయంలో రిజిస్ట్రేషన్ శాఖకు రెవెన్యూ, మునిసిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో కూడా పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్సు ప్రక్రియ జాప్యం జరుగుతోంది.

కార్పొరేషన్‌తోపాటు మండలాల్లోనూ ఎల్1, ఎల్2, ఎల్3 డెస్కుల మధ్య సమన్వయం ఉండడంలేదు. రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీ తదితర శాఖల అధికారుల టీంలు కూడా క్షేత్రస్థాయిలో పెండింగ్ ప్లాట్ల విషయంలో పరిశీలన చేసి త్వరగా నివేదికలు ఇవ్వకపోవడంతో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. 25 శాతం రాయితీ కలిపించి ప్రభుత్వం ప్లాట్ల దారులకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించింది.

ఈప్రక్రియను క్షేత్రస్థాయిలో ప్రతి ప్లాటు దరఖాస్తుదారుడికి సమగ్రంగా వివరించి పెండింగ్ సమస్యలు తొలిగిస్తే ఎల్ఆర్ఎస్ రాయితీ లక్ష్యం నెరవేరనుంది. నూరుశాతం లక్ష్యంగా ముందుకు వెళితే వంద కోట్ల ఆదాయం లక్ష్యం కలగనుంది. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌లో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందని చివరి మూడురోజుల్లో ఈ ప్రక్రియ మరింత వేగం చేస్తామని ఖమ్మం డీటీసీపీవో జీవీఎస్ ప్రసాద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్లాట్ల యాజమనులు 25శాతం ఎల్ఆర్ఎస్ సౌకర్యాన్ని ఈనెల 31 వరకు పొందవచ్చని వివరించారు.

90 శాతం వడ్డీ రాయితీ: కమిషనర్

పాల్వంచటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిదారులు ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద బకాయిలో 90 శాతం వ డ్డీ రాయితీ పొందాలని మునిసిపల్ కమిషనర్ సుజాత అ న్నారు. గురువారం పలు వార్డుల్లో పన్ను వసూళ్ల ప్రక్రియలో పాల్గొని ఆస్తి పన్ను చెల్లిస్తున్న పలువురుకి రశీదులను స్వయం గా అందజేశారు. ఆస్తి పన్ను చెల్లింపుల్లో బకాయిదారులు రా యితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఓ వెంకటలక్ష్మి, చావా రవి, పలువురు బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలను ఖాతరు చేయని శ్రీపతి

(5వ పేజీ తరువాయి)

ఇతనిపై నమోదైన కేసులు, ఇతరత్రా వివరాలు సేకరించినట్లు సమాచారం. శ్రీపతి భవన నిర్మాణం చేపట్టిన సమయంలో గ్రామ పంచాయతీ ఈవో స్వయంగా వచ్చి నిర్మాణం ఆపాలని హెచ్చరించారు. పాత భవనంపైన ఐదంస్తులు ఎలా కడుతున్నారని ప్రశ్నించారు. అక్కడే వున్న మేస్త్రీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టిన ఫ్లోర్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అయినా శ్రీపతి ఖాతరు చేయకుండా పనులు కొనసాగించి ప్రమాదానికి కారణమయ్యాడు. అలాగే గిరిజన సంఘాల నాయకులు ప్రశ్నించినా, శ్రీపతి వారిని లెక్కపెట్టలేదని తెలిసింది. శ్రీపతి ఓవర్‌యాక్షన్, అధికారులంటే లెక్కలేనితనం వల్లే ఘటన జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు అంటున్నారు. కాగా, శ్రీపతి దంపతులు తమ అదుపులోనే ఉన్నారని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ తెలిపారు. ఘటనపై బాధితులు ఇంకా లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని తెలిపారు. ఇదిలా వుండగా, భవన నిర్మాణం చేపడుతున్న సమయంలో యజమానులైన శ్రీపతి దంపతులను గ్రామపంచాయతీ అధికారి ప్రశ్నించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అలాగే గిరిజన సంఘం నాయకులు ప్రశ్నించిన మరో వీడియో సైతం సోషల్ మీడియాలో ప్రచారంలో ఉంది. మొత్తమ్మీద శ్రీపతి తీరు రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది.

భద్రాద్రిలో విషాదం



గురువారం రాత్రి ఎక్స్‌కవేటర్ సహాయంతో శిథిలాలు తొలగిస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

ఇదిలావుండగా, ప్రమాదం జరిగినప్పుడు మరో నలుగురు కూలీలు కూడా భవనంలో వున్నట్టు ప్రచారం జరిగింది. అయితే నిర్మాణదారు శ్రీపతి మాత్రం ఆ రోజు కామేశ్, ఉపేందర్‌రావు మాత్రమే పనిలో వున్నారని పోలీసులకు చెప్పాడు. దీంతో మృతుల సంఖ్య రెండుకు మించే అవకాశం లేదని భావిస్తున్నారు. మరోవైపు శిథిలాల్లో ఉన్నవారిని గుర్తించి వెలికి తీసేందుకు రంగంలోకి దిగిన ఏపీలోని విజయవాడ ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌కు చెందిన బృందం... జాకీ అనే శునకాన్ని శిథిలాల్లోకి పంపించగా అది కొద్దిసేపు గాలించి బయటకు వచ్చింది. శిథిలాల కింద ప్రాణాలతో ఉన్న వారిని శునకం వాసన చూసి గుర్తిస్తుందని, ఒకవేళ మృతి చెందితే గుర్తించే పరిస్థితి ఉండదని తెలుస్తోంది. ఉపేందర్‌రావు బతికివుంటే జాకీ గుర్తించేదని బృందం సభ్యులు చెబుతున్నారు. అనుకున్నట్టుగానే గురువారం అర్ధరాత్రి ఉపేందర్‌రావు మృతదేహం బయటపడింది.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించండి..

(5వ పేజీ తరువాయి)

రాకముందు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అరకొరగా చేసిందన్నారు. దీంతో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. తనకు రూ.రెండు లక్షల డెబ్బై వేలు అప్పు ఉండగా, రెండు లక్షలపైన ఉన్న రూ.70వేలు తాను చెల్లించినా ప్రభుత్వం మాత్రం రూ.రెండు లక్షల రుణమాఫీ చేయలేదన్నాడు. తాను పొలం కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశానని, అయితే పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో పెట్టుబడులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకోవాలని, ప్రతి రైతుకూ రూ.రెండు లక్షల రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశాడు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి..



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

(5వ పేజీ తరువాయి)

రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అడ్డదారిలో భవన నిర్మాణం చేపట్టిన శ్రీపతిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సాబీర్‌పాషా ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఇదిలావుండగా, స్థానిక బ్రిడ్జి పాయింట్‌లో ఉపేందర్ కుటుంబ సభ్యులు గురువారం ఉదయం కొద్దిసేపు రాస్తారోకో, నిర్వహించారు. దీంతో సమాచారం అందడంతో పోలీసులు వచ్చి వారిని అక్కడ నుంచి పంపించివేశారు. అలాగే ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

టేకులపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి గ్రామ సమీపంలోగల జమాయిల్‌కర్ర యార్డు వద్ద గురువారం జరిగింది. మృతుడు బండి రామకృష్ణ(48) ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కాకరవాయిగా గుర్తించారు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై జమాయిల్‌కర్ర యార్డు వద్దకు వచ్చి అక్కడ మంచినీరు తాగి సేదతీర్చుకొన్నాడు. ఈ క్రమంలో ఆయనకు గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. యార్డు యాజమాని విషయాన్ని పోలీసులకు తెలపడంతో మృతుని సెల్‌ఫోన్ ఆధారంగా మృతుని వివరాలను పోలీసులు తెలుసుకొన్నారు. మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి మార్చురికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామచంద్రపురం సమీపంలో ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడులు జరిపి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ తాళ్లూరి లక్ష్మయ్య, వాహన యజమాని లక్ష్మీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

వన్ నేషన్..వన్ ఎలక్షన్ దేశానికి ఎంతో కీలకం

నేలకొండపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): వన్ నేషన్, వన్ ఎలక్షన్ దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని బీజేపీ పాలేరు ఇన్‌చార్జి నున్నా రవికుమార్ అన్నారు. గురువారం నేలకొండపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ సంపదను దుర్వినియోగం గాకుండా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, జిల్లా కార్యదర్శి హట్యానాయక్, రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు, జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, తోగటి నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల విడుదల

కూసుమంచి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పత్రికలకు విడుదల చేశారు. 2025-26 సంవత్సరంలో ప్రవేశానికిగాను 80సీట్లకు గాను 3213 మంది పరీక్షలు రాశారు. ఈ మేరకు ఎంపికయిన విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్లను విడుదల చేశారు.

కమీషన్ బకాయిలు ఐకేపీ కేంద్రాలకు చెల్లించాలి

వీసీలో పీఆర్ కార్యదర్శి లోకేష్ కుమార్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సెర్ప్ కార్యక్రమాలపై సెర్ప్ సీఈవో దివ్యతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్టిచ్చింగ్ సెంటర్లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంకులను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, గతంలో ఖమ్మం జిల్లాలో ఉన్న 37 ఐకేపీ కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్ 137 కు పెంచామన్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన కమీషన్ పౌర సరఫరాల శాఖ వద్ద పెండింగ్ ఉందని అన్నారు. గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో ఏర్పాటుకు సహకారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, డీఈవో సోమశేఖర శర్మ, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

11మంది మైనింగ్ అధికారుల బదిలీ

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో పని చేస్తున్న 11మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులను జారీ చేసింది. రామగుండం ఓపెన్‌కాస్టు 1లో డీజీఎంగా పని చేస్తున్న ఉదయ్‌హరిజన్‌ను రామగుండం -2కు బదిలీ చేయగా గోదావరిఖని 1 ఇంక్లైన్‌లో పని చేస్తున్న డిప్యూటీ జీఎంను డి. రమేష్ రామగుండం -3 మేనేజరుగా బదిలీ చేశారు. కోయగూడెం ఓపెన్‌కాస్టులో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సుమన్‌ను మణుగూరు పద్మావతిఖనికి బదిలీ చేశారు. కొత్తగూడెం కార్పొరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న యూసుఫ్‌ను స్టోర్స్‌కు బదిలీ చేయగా రామగుండం -1లో అడిషనల్ మేనేజరుగా పని చేస్తున్న పేరాల శ్రీనివాసరావును కోయగూడెం ఓసీ-2కు బదిలీ చేశారు. రామగుండం -3లో పని చేస్తున్న అడిషనల్ శంభునాథ్‌ను కేకే 5 ఇంక్లైన్ మేనేజుగా, ఖైరగూడెం ఓపెన్‌కాస్టులో పని చేస్తున్న రామారావును ఎంవీటీసీ శ్రీరాంపూర్‌కు, రామగుండంలో పని చేస్తున్న జితేందర్‌కుమార్‌ను మణుగూరు కొండాపూర్‌కు, మణుగూరు పీకే ఓసీలో పని చేస్తున్న మిట్టపల్లి శ్రీరాంపూర్‌కు, ఆడ్రియాల ప్రాజెక్టులో పని చేస్తున్న విశ్వనాథ్‌ను కొత్తగూడెం ఏరియా పీవీకే 5 ఇంక్లైన్‌ను, మణుగూరు కొండాపూర్ మైన్‌లో పని చేస్తున్న అక్రమ్ అలీఖాన్‌ను రామగుండం -1కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకు టెక్నికల్ ఫెస్ట్

ఘనంగా అకిట్స్ ప్రజ్ఞాన్ 2కె25


కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు

సుజాతనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు టెక్నికల్ ఫెస్ట్ ఎంతగానో దోహదపడతాయని 'అకిట్స్' చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేపలగడ్డలో గల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అకిట్స్ ప్రజ్ఞాన్ 2కె25 రెండు రోజుల నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్, వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటి రెండు రోజులు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, షార్ట్ ఫిలిమ్స్, ప్రాజెక్ట్ ఎక్స్పో టెక్నికల్ క్విజ్ కార్యక్రమాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఆఖరి రోజు కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ దయాకర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జబర్దస్త్ స్కిట్‌లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రమేష్, సైదయ్య, కన్వీనర్ శ్రీకాంత్, డీన్ అకాడమిక్స్ బాబురావు, లక్‌పతి, కో కన్వీనర్ మునీర్, కృష్ణ మోహన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జెట్టి శ్రీనివాస్, హెచ్వోడీలు రవికిరణ్, వినోద్, సురేష్, అంబిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

డీఎస్పీ సతీష్ కుమార్.. ప్రశాంత కాలనీలో కార్డన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాల్వంచ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం ప్రశాంత కాలనీలో పాల్వంచ డివిజన్ పోలీసులు చేపట్టిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో పాల్గొని అధికారులకు పలు సూచనలందించారు. ఈ క్రమంలో పోలీసులు ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా గాలించి ప్రజల ఆధార్ కార్డులను పరిశీలించి పలు వ్యక్తిగత వివరాలను సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో పలువురు అనుమానిత వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలను, రెండు ఆటోలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు కాలనీలో తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు. అనంతరం డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్ఐలు సుమన్, రాఘవయ్య, జీవన్‌రాజ్, కళ్యాణి, రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెప్మాకు స్త్రీ నిధి అవార్డు



పాల్వంచ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో స్త్రీ నిధి రికవరీలో ద్వితీయస్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పాల్వంచ మున్సిపాలిటీ అమ్మ దీవెన పట్టణ సమాఖ్య నిలిచింది. ఈ మేరకు సమాఖ్యకు అవార్డు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క హాజరై సమాఖ్య ప్రతినిధులు నాగమణి, బుజ్జికి ఈ అవార్డును (2023-24) ఆర్థిక సంవత్సరానికి అందచేశారు. ఈ అవార్డు అందుకున్న సమాఖ్య సభ్యులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ అభినందించారు. మిగతా మున్సిపాలిటీ పరిధిలోని సమాఖ్యలో కూడ వంద శాతం రికవరీ చేసి వచ్చే సంవత్సరం కూడ అవార్డు అందుకోవాలని మెప్మా అధికారులకు సూచించారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి జిల్లాలోని ఎస్సీఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ కులాలకు చెందిన విద్యార్థులతో పాటు దివ్యాంగుల విద్యార్థిని విద్యార్థులకు సైతం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఫ్రెష్ , రెన్యూవల్ అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఈ - పాస్ అధికారిక వెబ్ సైట్‌లో మే 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, చివరి గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి ఏడాదిన్నర బాలుడి మృతి



ఇల్లెందురూరల్,మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తుండగా ట్రాక్టర్ కింద పడి ఏడాదిన్నర బాలుడు మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం బోయితండా గ్రామపంచాయతీ ఎల్లన్ననగర్ గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు ఎల్లన్ననగర్ గ్రామానికి చెందిన వాంకుడోత్ శ్రీకాంత్, కళ్యాణి దంపతుల చిన్న కుమారుడు ఆర్యన్(18నెలలు) ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఇంట్లో ఉన్న ట్రాక్టర్‌ను ఆర్యన్ పెద్దనాన్న రాములు రివర్స్ తీస్తుండగా ట్రాక్టర్ వెనుకల వచ్చిన ఆర్యన్ గమనించక పోవడంతో ఆర్యన్ మీద నుండి ట్రాక్టర్ వెళ్లింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తీవ్రంగా గాయపడిన ఆర్యన్‌ను ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా గుట్ట వెంకన్న రథోత్సవం



పాల్వంచటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి గుట్ట వెంకన్న కల్యాణం అనంతరం జరిగిన వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ శ్రీనివాసగిరి నుంచి దమ్మపేట సెంటర్, అంబేద్కర్ సెంటర్, కేఎస్పీ రోడ్డు, నటరాజ్ సెంటర్, శాస్త్రీ రోడ్ బస్టాండ్ సెంటర్ మీదుగా తిరిగి శ్రీనివాసగిరి వరకూ రథోత్సవం సాగింది. కార్యక్రమంలో భక్త సమాజ మండలి సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు జలాల్లో గిరిజన ప్రాంతాలకు అన్యాయం

ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీటి కోసం రైతుల ఎదురు చూపు

అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లెందు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందించకుండా తీరని అన్యాయం చేశారని శాసనసభలో ఇల్లెందు ఎంఎల్ఏ కోరం కనకయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గం రోళ్లపాడులో గత ప్రభుత్వ సీఎం కేసీఆర్ 2016లో శంకుస్థాపన చేశారని, మూడు జిల్లాల పరిధిలోని 6.74లక్షల ఎకరాల భూములకు సాగునీరు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అందించే లక్ష్యంతో సాగునీటి పథకం రూపొందించడం జరిగిందని తెలిపారు. కానీ ఇల్లెందు నియోజకవర్గంలోని భూములకు సాగునీరు రాకుండా సింగరేణి మండలం చీమలపాడు టన్నెల్ నుంచి జూలురుపాడు మీదుగా డైవర్షన్ చేసి గోదావరి జలాలు అందకుండా గిరిజన ప్రాంతాలకు అన్యాయం చేశారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల భూములకు చుక్క నీరు అందించకుండా నాగార్జునసాగర్ జలాలు పారుతున్న భూములకే సీతారామ జలాలు అందిస్తున్నారని వివరించారు. సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు ఎలైన్‌మెంట్‌ను మార్చి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు జిల్లాల పరిధిలో ఉన్న ఇల్లెందు నియోజకవర్గంలో సుమారు 80శాతం గిరిజన ప్రాంతాల రైతాంగం సాగునీటి కోసం ఎదురుచూస్తుందని, టేకులపల్లి మండలం రోళ్లపాడు రిజర్వాయర్ ద్వారా మూడు జిల్లాల పరిధిలోని ఇల్లెందు నియోజకవర్గ భూములకు గోదావరి జలాలు అందించాల్సి ఉండగా చుక్కనీరు ఇవ్వకుండా నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే కనకయ్య ప్రభుత్వానికి వివరించారు. నేడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ ప్రభుత్వం ఉందని సీతారామ జలాలను గిరిజన ప్రాంతాలతో కూడిన ఇల్లెందు నియోజకవర్గం రైతాంగానికి మన ప్రభుత్వం అందించాలని ఎమ్మెల్యే కనకయ్య శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

అశ్వాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి సామ్రాజ్యం (40) ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 25న ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించగా, గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆమెను భద్రాచలంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్/తల్లాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన అద్దంకి రాము(32) ఈ నెల22న మండలంలోని నారాయణపురంలో తన అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. పట్టణంలోని జ్యోతి నిలయం ఎదుటనున్న ఓ హోటల్ వద్ద పార్క్ చేసి ఉన్న వాహనం కదలికలను గమనించక ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. భార్య నీలిమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కరకగూడెంలో...

కరకగూడెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కరకగూడెం పంచాయతీ మోతే గ్రామానికి చెందిన నైనరాపు సాగర్ (30) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఈనెల 9న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి ఇటీవల ఇంటికి తీసుకరాగా గురువారం మృతి చెందాడు. మృతుడు భార్య నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నరేంద్రస్వామి ఆలయంలో చోరీ

మధిర రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలోగల నరేంద్రస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీ చేశారు. ఆలయ అర్చకుడు రామకృష్ణశర్మ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామంలోగల నరేంద్రస్వామి ఆలయానికి ఎడమవైపు ఉన్న గేటుతాళం పగులగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. హుండీ పగులగొట్టి అందులో నగదును, అంతరాలయం గేట్లు పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారికి ఉన్న 210 గ్రాముల వెండి కిరీటాన్ని అపహరించుకుపోయారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గేట్ల తాళాలను గుడి పక్కనేగల కాలేజీ చెట్లలో దూరంగా పడేసి వెళ్లారు. ఉదయం ఐదుగంటల సమయంలో ఆలయాన్ని తెరిచేందుకు వెళ్లిన అర్చకుడు రామకృష్ణశర్మ ఆలయ గేట్లు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే గ్రామస్థులకు, మధిర రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మధిర సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తమ సిబ్బందితో కలిసి వెళ్లి చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ, శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,84,502 మెట్రిక్ టన్నుల కాగా అందులో సన్నరకం 99.729 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం ధాన్యం వస్తుందనే అంచనాతో 144 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతన్న పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనకు ఏ,బీ గ్రేడ్ రకాలుగా విభజించి మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాటు పై చెక్ లిస్టు జారీ చేస్తామని, ఆ ప్రకారం ఏర్పాట్లు చేసి ధృవీకరణ నివేదికలు అందచేయాలన్నారు. జిల్లాకు సమీప రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దులో 8 చెక్‌పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీఎంఆర్ 2024-25 ఖరీఫ్ సంబంధించి డెలివరీలను సకాలంలో చేసే విధంగా రైస్ మిల్స్‌ను తనిఖీ చేసి నివేదికలు అందించాల్సిందిగా పౌరసరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ధాన్యం మద్దతు ధర నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన,పౌర సరఫరాల సంస్థ మేనేజరు త్రినాథ్, పౌర సరఫరాల అధికారి రుక్మిణి, డీసీవో కుర్షిద్, ఏవో బాబురావు, జీసీసీ మేనేజరు విజయ్‌కుమార్, తూనికలు కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, ఆనందరావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కేఎంసీ ఉద్యోగుల విధులకు ఆటంకం

» ప్రభుత్వ చేతి పంపునకు అపార్ట్‌మెంట్ బోర్ కనెక్షన్

» తొలగించేందుకు వెళ్లిన ఉద్యోగులపై ఓ వ్యక్తి దూషణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చేతి పంపును కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నీటి అవసరాలకు మూడేళ్లుగా వాడుకోవడంతో పాటుగా కేఎంసీ ఉద్యోగుల విధులకు ఆటంకం చేసిన సంఘటన ఖమ్మంలో చోటు చేసుకొంది. దీంతో కేఎంసీ ఉద్యోగులు ఖమ్మం త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌కు సమీపంలో ప్రభుత్వ చేతి పంపు ఉంది. గత మూడేళ్లుగా ఆ చేతి పంపులోకి అపార్టుమెంట్ నిర్వాహకులు బోరును ఏర్పాటు చేసి వాహనాలు శుభ్రం చేసేందుకు, ఇతర అవసరాలకు నీటిని వినియోగం చేస్తున్నారు. అయితే వేసవి కార్యాచరణలో భాగంగా గురువారం కేఎంసీ ఇంజనీరింగ్ అధికారి కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, లైన్‌మన్ సూరిబాబు, బోర్ మెకానిక్ సూరిబాబు కలిసి ప్రభుత్వ చేతి పంపులో ఉన్న ప్రైవేట్ బోరును తొలగించేందుకు ప్రయత్నించారు. దీంతో అపార్టుమెంట్‌లో ఉన్న పుల్లయ్య అనే వ్యక్తి బయటకు వచ్చి 'మీ అయ్యా జాగీరా' అంటూ కేఎంసీ ఉద్యోగులను దూషిస్తూ వారిపై దాడి చేసేందుకు యత్నించాడు. దీంతో అక్కడ నుంచి వెనుదిరిగిన కేఎంసీ ఉద్యోగులు పై స్థాయిలోని అధికారులకు సమాచారం అందించి ఖమ్మం త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పోలీసులు ఉన్నతాధికారులతో మాట్లాడడంతో వెంటనే పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కేఎంసీ ఉద్యోగులు కోరుతున్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు శిక్ష

ఖమ్మం లీగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రశాంతినగర్ కు చెందిన నిందితుడైన పుచ్చకాయల అనంతరాములుకు చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలుశిక్ష, రూ.లక్ష నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయధికారి కాసరగడ్డ దీప గురువారం తీర్పుచెప్పారు. ఖమ్మం నగరం రోటరీ నగర్‌కు చెందిన ఎస్.ఉమావెంకటరమణ వద్ద నిందితుడు 2020లో రూ. లక్షను అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. రుణం ఇవ్వమనడంతో 2020లో లక్షా 10వేలకు చెక్కును ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితురాలి ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాదు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

వేమన పద్యాలతో 'అఫ్రియా' మేధోమథనం



» శతక పద్యాల అవధానంతో ప్రతిభ
» 28న ద్వాదశ పృచ్ఛక అవధానం చేయనున్న అఫ్రియా

సత్తుపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల ఏళ్ల క్రితం ప్రజాకవిగా పేరుగాంచిన యోగి వేమన వేలాది ఆటవెలది పద్యాలను రాశారు. నేడు శతక పద్యాలను రాయడంలో వేమన ఉద్దేశ్యం ఏమైనప్పటికీ, ఇప్పటి విద్యార్థులు సులభంగా తమ మాతృభాషను నేర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వేమన పద్య పఠనం, లేఖనం, అవధానం లాంటి ప్రక్రియలతో సత్తుపల్లి పరిసర ప్రాంత విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ క్రమంలో సత్తుపల్లి పట్టణానికి చెందిన మహ్మద్ అఫ్రియా కూడా వేమన శతక పద్యాలు చూడకుండా చదవడం, రాయడంలో పట్టు సాధించి అవధానం నిర్వహించి తన మేధోశక్తిని చాటేందుకు సిద్ధమయ్యారు.

సత్తుపల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ వ్యాపారం చేస్తుండగా, తల్లి రాబియా గృహిణి. అక్క పదో తరగతి పరీక్షలు రాస్తోంది. అఫ్రియా స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. అఫ్రియా ఈ నెల 28న సత్తుపల్లిలోని జేవీర్ డిగ్రీ కళాశాలలో జరగనున్న ద్వాదశ(12) పృచ్ఛక అవధానానికి సమాయత్తమవుతోంది. సృజన సాహితీ సమాఖ్య పర్యవేక్షణలో గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్టు ఆధ్వర్యంలో అవధానం జరగనుంది. అవధానం జరిగే తీరును నిర్వాహకులు మధుసూదనరాజు, రామకృష్ణలు వివరించారు.

అవధానం జరిగే తీరు...

వేమన శతకంలోని వంద పద్యాల ఆధారంగా ఎనిమిది మంది పృచ్ఛకులు ఎనిమిది అంశాలపై ప్రశ్నలు సంధిస్తుంటే అఫ్రియా సమాధానాలు ఇస్తుంది. పద్యం నెంబరు చెబితే ఆ పద్యం చూడకుండా అప్పగించడం, పద్యంలో మొదటి పదం చెబితే ఆ పద్యం నెంబరు చెప్పి పద్యం మొత్తం అప్పగించడం, పద్యం నెంబరు, లైన్ నెంబర్ చెబితే ఆ లైను అప్పగించడం, పద్యం నెంబర్, లైన్ నెంబరు, పదం నెంబరు చెబితే ఆ పదం ఏమిటో వివరించడం, పద్యం నెంబరు చెప్పి ముందుపదం, వెనుక పదం చెబితే మధ్యలో పదం చెప్పడం, పద్యం ఒక పాదం చదివితే పద్యం నెంబర్ చెప్పి, పద్యం మొత్తం అప్పగించడం, పద్యం నెంబర్, ఒక లైన్ చెబితే ఆ లైనులో మొదటి పదం చెప్పడం, పద్యం నెంబరు చెబితే పద్యాన్ని చూడకుండా రాయడం అవధాన ప్రక్రియలో ఉన్నాయి. మరో నలుగురు అతిథులు పృచ్ఛకులుగా మారి వారు అడిగే అంశాలకు కూడా అఫ్రియా జవాబు ఇస్తుంది.

పలువురు విద్యార్థుల అవధానం

సత్తుపల్లి మండలంలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులు, బొల్లేపల్లి-గార్లపాటి ట్రస్టు నిర్వాహకులు మధుసూదనరాజు, రామకృష్ణల ఆధ్వర్యంలో శతక పద్యాలను నేర్చుకొని అసాధారణ ప్రతిభను చాటి అవధానాలు చేశారు. 2014లో సిద్దారం విద్యార్థులు నాగవంశీ, శ్రీలతలు వేమన శతకంపై శతావధానం నిర్వహించారు. అదే ఏడాది సిద్దారం విద్యార్థులు భవాని, విజయలక్ష్మీలు దాశరధి శతకంపై శతావధానం నిర్వహించారు. 2015లో చిలక రాహుల్ వేమన శతక పద్యాలను ఏడున్నర నిమిషాల్లో పఠించి రికార్డు సృష్టించాడు. 2017లో మూడవ తరగతి చదువుతున్న యామినిశ్రీ వేమన శతక పద్యాలను వెనక నుంచి చదివి అబ్బురపరిచింది. ఇటీవల బొర్రా మన్విత్ అనే విద్యార్థి వేమన శతకంపై అష్టావధానం చేయగా ప్రస్తుతం అఫ్రియా ద్వాదశ అవధానం చేయనుంది. అవధాన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాగమయి, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, ఇతర అతిథులు హాజరవుతారని తెలిపారు.

టీఎస్ఎఫ్‌డీ నుంచి నాలుగు బృందాలు

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి ఘటనలో తెలంగాణ స్టేట్ ఫైర్ డిజాస్టర్స్ రెస్క్యూ ఫోర్స్‌కు చెందిన నాలుగు బృందాలు పాల్గొంటున్నాయి. ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, పినపాకకు చెందిన నాలుగు బృందాలు ఇందులో పాల్గొంటున్నాయి. హైడ్రాలిక్ కాంబేటూల్, డైమెండ్ చైన్సా, లిమాటిక్ లిఫ్ట్ ప్యాక్స్, రెస్క్యూ టెండర్‌ను వరంగల్ నుంచి తీసుకొచ్చారు. వీటితో పాటు విక్టిమ్ లోకేషన్ కెమెరా లాంటి పరికరాలతో శిథిలాల్లో ఉన్న వారిని వేగంగా గుర్తించేందుకు టీఎస్ఎఫ్‌డీఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వీటిని వినియోగించాయి.



సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు

తొలిసారిగా విక్టిమ్ లొకేషన్ కెమెరా వినియోగం

భద్రాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా భవనాలు కూలిన సమయంలో శిథిలాల్లో ఉన్న వారిని గుర్తించేందుకు తెలంగాణ రాష్ట్ర ఫైర్ డిజాస్టర్స్ రెస్క్యూ ఫోర్సు సిబ్బంది విక్టిమ్ లొకేషన్ కెమెరా సహాయంతో శిథిలాల కింద ఉన్న వారి ఆచూకీ కనుగొంటారు. లిఫ్ట్‌లలో గాని, సందుల్లో గాని ఇరుక్కున్నా ఆ వ్యక్తి ఉన్నారా లేదా లేకుంటే శ్వాస తీసుకుంటున్నారో లేదో అని తెలుసుకుంటారు. ఇందు కోసం కెమెరా, మైక్రో ఫోన్ సహాయంతో పరికరానికి ఉన్న డిస్‌ప్లేలో చూడొచ్చు. ఈ పరికరంతో శిథిలాల్లో ఉండే వ్యక్తితో మాట్లాడటంతో పాటు లోపల ఉన్న వారు బయట ఉన్న వారు పరస్పరం వినే అవకాశం ఇందులో ఉంటుందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, భద్రాచలం అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాస్‌లు తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఈ విధంగా ఈ పరికరాన్ని ఉపయోగించిన సందర్భం ఇదే తొలిసారి అని వారు తెలిపారు.





నిబంధనల మేరకు వరి కోత యంత్రాలు పనిచేయాలి

రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు వరికోత యంత్రాలు పని చేయాలని, వరి నూర్పిడిలో నాణ్యతను పాటించాలని జిల్లా ఇన్‌చార్జ్ రవాణా అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. జిల్లాలోని వరి కోత యంత్రాల నిర్వాహకులు, డ్రైవర్లతో గురువారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వరి పంట నూర్పిడి సందర్భంగా తాలులో వరి ధాన్యం కలవకుండా నిర్ణీత స్పీడ్ మేరకు యంత్రాల నిర్వాహణ ఉండాలని ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించిన ఆదేశాలను వివరించారు. ఏఎంవీఐ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..

పరిమితికి మించి ప్రయాణం.. పట్టించుకోని అధికారులు

మిర్చి ఏరివేతకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కూలీలు

కూసుమంచి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి లేని కారణంగా పెద్దసంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి మహిళలు పరిమితికి మించి తరలివస్తున్నారు. పరిమితికి మించి తరలి వెళ్తే ప్రమాదమని తెలిసినప్పటికీ డబ్బుల కోసం ప్రాణాలను సైతం లెక్క చేయడం లేదు. పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో మిర్చి కాయల కోతలు, ఏరివేత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఆటోల్లో పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు, ఉదయం 8.00 గంటలకు బయలుదేరి సాయంత్రం 7గంటలకు ఇళ్లకు చేరుతున్నారు. కూలీలు అవసరం ఉన్న వాహనాలకు చార్జీలతో పాటు ప్రతిఒక్కరికి రూ.400 నుంచి 500 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆటోవాలాలు నిబంధనల మేరకు ఆరుగురిని ఎక్కించుకోవాల్సి ఉండగా సుమారు 20మందికి పైగా తమ ఆశకొద్దీ కూలీలను తరలిస్తున్నారు. ఇటీవల నర్సింహులగూడెం, నాయకన్‌గూడెం, గట్టుసింగారం, పెరికశింగారం గ్రామాల్లో పలు ఆటో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గత ఏడాది పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. కుటుంబాలు చిన్నా భిన్నం అయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆటోవాలు, కూలీలు తీరు మారడం లేదు. ఇప్పటికైన పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఆటోవాలలను నియంత్రించాల్సి ఉంది. లేనిపక్షంలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.





ప్రమాదకర స్థితిలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు

ఆర్టీసీ కార్మికుల సేవలు అభినందనీయం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. వాటర్ బాటిళ్ల పంపిణీ



వాటర్ బాటిల్‌ను అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన వ్యవస్థ సజావుగా జరిగేందుకు కృషి చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సేవలు అభినందనీయం అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని ఖమ్మం ఆర్టీసీ బస్సు డిపోలో సిబ్బందికి కలెక్టర్ వాటర్ బాటిల్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శరీరంలో రక్తం ఎంత ముఖ్యమో ప్రజలకు సేవలు అందించే ఆర్టీసీ కుడా అంతే ముఖ్యమని, ప్రజలకు ఆర్టీసీ కార్మికులు చాలా సేవలు అందిస్తున్నారని, వీరి కృషి ఫలితంగా నేడు విద్యార్థులు విద్యా, మహిళలకు ఉపాధి అవకాశాలు, మెరుగైన రవాణా సేవలు అందుతున్నాయన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడి పని చేస్తున్నారని, ప్రస్తుత వేసవి కాలంలో వారికి ఉపయోగపడే విధంగా జిల్లా యంత్రాంగం తరుపున 650 వాటర్ బాటిళ్లను అందిస్తున్నామన్నారు. కార్మికుల పిల్లల చదువులు, ఇతర సమస్యలను మా పరిధి మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆర్టీసీ కార్మికులందరికి ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రత్యేకంగా పంపించి శిక్షణా తరగతులు ఏర్పాటుకు సమకారం అందిస్తామన్నారు. మహిళా కండక్టర్లకు అవసరమున్న చోట పెట్రోల్‌బంకుల్లో ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటుకు ప్రతిపాతనలు అందించాలని అధికారులకు సూచించారు. ఆర్టీసా డిపెకు వచ్చి కార్మికులందరికి మంచి నీళ్ళు వెంట ఉంచుకునేందుకు మిల్టన్ వాటర్ బాటిల్స్ అందించిన కలెక్టర్‌కు ఆర్టీసీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ మెకానికల్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ రామిశెట్టి రామయ్య, డిపో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లే నిరుపేదలకు ఆర్థిక భరోసా

కేఎంసీ ఎదుట సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నిరసన



ధర్నా నిర్వహిస్తున్న మాస్ లైన్ నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్లు ఆర్థిక భరోసాగా ఉంటున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా ఒక్క పింఛన్ మంజూరు చేయలేదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, ఆవుల అశోక్ విమర్శించారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపులో బాగంగా గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు మంజూరు కాలేదని విమర్శించారు. పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇవ్వకపోతే ప్రత్యామ్యాయంగా ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే బీఆర్‌ఎస్ దారిలోనే కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతుందని ఆరోపించారు. అదనంగా ఆసరాకు బడ్జెట్ కేటాయింపులు జరపటం లేదన్నారు. బోధకాలు బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతోందని అన్నారు. హామీలు తప్ప ఆచరణ జరగడం లేదని అన్నారు. నాయకులు ఝాన్సీ, శిరోమణి, శోభ, కే శ్రీనివాస్, బల్లెపల్లి వెంకటేశ్వర్లు, కే శ్రీనివాస్, సత్తార్, లెనిన్, వెంకటేష్, లక్ష్మణ్; లక్ష్మీనారాయణ, చందు, రామారావు, జాస్మిన్, రమేశ్, భద్రయ్య పాల్గొన్నారు

'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు బాగుండాలి

సమీక్షించిన అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన చాంబర్‌లో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 26 వరకు నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఓపెన్ పదో తరగతి పరీక్షలు రాసే 655 మంది అభ్యర్థులకు 4 పరీక్షా కేంద్రాలు, 898 మంది ఇంటర్ అభ్యర్థులకు మరో 4 పరీక్షా కేంద్రాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు 8 సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల లోపలికి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఎవరికి అనుమతి లేవని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్‌ఎం అత్యవసర మందుల కిట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరా, పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ పనులను మున్సిపల్ అధికారులు చేపట్టాలన్నారు. పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలు పోస్టల్ శాఖ ద్వారా డీఆర్డీసీ సెంటర్‌కు పంపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర వర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, ఓపెన్ స్కూల్ కన్వీనర్ పాపారావు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

విద్యా వ్యవస్థను మెరుగు పర్చడమే లక్ష్యం

నేలకొండపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ భారతదేశంలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చటమే లక్ష్యంగా కోరమాండల్ గ్రోమోర్ సంస్థ కృషి చేస్తుందని కోరమాండల్ గ్రోమోర్ జోనల్ హెడ్ డీజీఎం సానికొమ్ము శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాజేశ్వరపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు రూ.3లక్షల విలువైన బెంచీలు, కుర్చీలను గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అందచేశారు. మండల విద్యాధికారి బాలిన చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులో మెరుగైన ఫలితాలను సాధించాలని, తద్వారా ఉన్నత స్థాయికి ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించటానికి మన గ్రోమోర్ కృషి చేస్తుందన్నారు. మన గ్రోమోర్ సంస్థ అందించిన సహాయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరెడ్డి కోరారు. ఎంపీడీవో మర్రి యర్రయ్య, ఎంఈవో బాలిన చలపతిరావులు మాట్లాడుతూ విద్య జీవితంలో విజయం సాధించటంలో కీలకమన్నారు. చదువు నేర్చిన విద్యార్థులు బడి బయట ఉన్న పిల్లలకు చదువు నేర్పటంలో సహకరించాలని, తద్వారా నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సౌకర్యార్థం రూ.3లక్షల విలువైన బెంచీలు, కుర్చీలు విద్యార్థులకు వితరణ చేసిన మన గ్రోమోర్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో రాజేశ్వరపురం ప్రత్యేక అధికారి, ఏవో ఎం.రాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, కార్పొరేట్ హెచ్‌ఆర్ మంజు, ఏరియా మార్కెట్ మేనేజర్ సురేష్, స్థానిక స్టోర్ మేనేజర్ కనకం శ్రీరాములు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం రాత్రి టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండగలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించాలన్నారు రంజాన్ మాసం ఆధ్యాత్మిక భక్తికి, స్వీయ క్రమశిక్షణకు ఉత్తమ సమయంగా భావిస్తారని సమాజంలో కృతజ్ఞత, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేద ప్రజలను ఆదుకోవడానికి వారికి దానం చేయడానికి కోపాన్ని నిగ్రహించుకోవడానికి ఈ రంజాన్ పండుగ జరుపుకుంటారని ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మం జిల్లా జేఏసీ ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు పెంపొందించే విధంగా కృషి చేస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేసీ ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, కో చైర్మన్ యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, లెక్చరర్స్ అసోసియేషన్ సంఘం కృష్ణార్జునరావు, సురేష్, వాసిరెడ్డి శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం బిక్కు, కోడి లింగయ్య, డ్రైవర్ల సంఘం వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి విందు ఆరగించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కలెక్టర్‌కు ఫ్రూట్ తినిపిస్తున్న నాయకులు

సన్నబియ్యం సరఫరాకు సన్నద్ధం

రేషన్ దుకాణాలను పరిశీలించిన డీఎస్‌వో

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చౌకదుకాణాల ద్వారా నిరుపేదలకు ఉగాది నుంచి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన ఖమ్మం నగరంలోని పలు రేషన్‌దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సన్నబియ్యం సరఫరా అయ్యాయా లేదా అని పరిశీలించారు. గతంలో మిగిలిన దొడ్డు బియ్యం నిల్వలు ఎంత మేరకు ఉన్నాయి... ప్రస్తుతం సన్న బియ్యం ఎంత నిల్వలు ఉన్నాయని డీలర్లను అడిగితెలుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా వేగిరంగా డీలర్లకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది నుంచి పేదలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బియ్యం పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీటీ విజయ్‌బాబు, పలువురు డీలర్లు ఉన్నారు.

న్యూ ఇరాలో ఘనంగా

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులతో పాఠశాల చైర్మన్

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూఇరా పాఠశాలలో గురువారం యుకేజీ, 5వ తరగతి విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవం(గ్రాడ్యుయేషన్ డే)వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ఐవి. రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అనేవి యువ అభ్యాసకులు విజయాలను, విద్యామార్గంలో తదుపరి దశకు సంసిద్ధతను గుర్తించే ప్రత్యేక సందర్భాలు అని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలి

కామేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నూతన ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ తహశీల్దార్ సుధాకర్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త కార్యదర్శి ఎన్వీ రాకేష్ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 15నెలలుగా పెన్షన్లు అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు మంత్రులు ఉన్నా బడ్జెట్లో నిధులు పెంచకపోగా ఇవ్వాల్సిన నిధులు ఇతర రంగాలకు మార్చి బాధితులకు అన్యాయం చేశారని విమర్శించారు. మండలంలో బోదకాలు, వికలాంగులను గుర్తించి పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి సందీప్, చల్లా రాజు, పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి వీరన్న, కొయ్యల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యంగా పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను నాణ్యతాయుతంగా నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ బుచ్చిబాబు అన్నారు. గురువారం క్వాలిటీ కంట్రోల్ బృందం సభ్యులు ఈఈలు వెంకటరమణ, డీఈ చంద్రమోహన్ తదితరులు సీతారామ ప్రాజెక్టు పనులతో పాటు తిరుమలాయపాలెం వద్ద నిర్మిస్తున్న అండర్ టన్నెల్ పనులను పరిశీలించారు. అనంతరం మున్నేరుకు ఇరువైపులా నిర్మిస్తున్న రక్షణ గోడల నిర్మాణాలను వారు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ తర్వాత మంచుకొండ సమీపంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మూడు నెలలో పనులను పూర్తి చేయడం పట్ల ఖమ్మం నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఈఈలు మంగళపూడి వెంకటేశ్వర్లు, అననీయ, డీఈ ఝాన్సీ, మన్మథరావు, రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

'ఉపాధి'లో వెల్లువెత్తిన అక్రమాలు

తిరుమలాయపాలెం, మార్చి27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీపథకం అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. గురువారం తిరుమలాయపాలెం మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పథకం 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 40గ్రామ పంచాయతీల్లో కూడా వన నర్సరీకి ఏర్పాటుచేసిన మొక్కలు మచ్చుకైనా కనిపించడంలేదని, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తనిఖీల్లో తేలింది. మంగలిబండ తండాలో ఉపాధి పథకంలో బినామీ పేర్లుపెట్టి ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శించారని తేలింది. పిండిప్రోలు ఎర్రగడ్డతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఈ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు నిర్మాణం అనంతరం సైడ్‌బర్మ్ పోయకుండానే బిల్లులు డ్రా చేశారని వెల్లడైంది. 5 గ్రామ పంచాయతీల్లో బినామీ జాబ్‌కార్డులు దర్శనమిచ్చాయని, పాతర్లపాడులో మన ఊరు మనబడి కింద నిధులు మంజూరయితే పనులు చేపట్టకుండానే నిధులు డ్రాచేశారని వెల్లడయింది. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, విజిలెన్సు అధికారి సక్రియా, విజిలెన్సు మేనేజర్ పవన్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఏపీడీ శ్రీదేవి, ఏపీవో నరసింహారావు, అంబుడ్స్‌మెన్ కె.రాజేష్, ఎస్‌ఆర్‌పీలు సాంబశివాచారి, కాసన్న తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి27(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు తగిన స్థానం కల్పించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కలిపించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. మాదిగలకు జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వాటా కల్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పైలేరియా వ్యాధిగ్రస్తులకు పింఛన్ ఇవ్వాలి

తిరుమలాయపాలెం,, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు కోరారు. గురువారం తిరుమలాయపాలెంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందించారు. బోదకాలు వ్యాధి బాధితులతోపాటు ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వలేదన్నారు ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసిందని హామీలు అమలుచేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, తిమ్మిడి హనుమంతరావు, ఆర్.శివలింగం, కొత్తపల్లి వెంకటరెడ్డి, ఆరెంపుల వెంకన్న, మీగడ సత్యం, నామా అప్పారావు, గోకినపల్లి సరోజన పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి వితరణ

కామేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల కేంద్రంలో 140 యేళ్ల నాటిబాలత్రిపురసుందరి సమేత సపంచాయతన సహిత ఇష్టకామేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఏలూరి రాధయ్య కుమార్తె దుర్గ రూ.6లక్షలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈకార్యక్రమంలో గొట్టుపర్తి శివాజి, భూక్య శ్రీను, దమ్మలపాటి శివాజి, మహంకాళి రామనర్సయ్య, పోస్ట్ నాగేష్, ఏలూరి రాధయ్య, ఏలూరి జానకిరామయ్య తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డ అదృష్టంగా భావించాలి

నేలకొండపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టడం అదృష్టంగా భావించాలని, ఆడబిడ్డ ఇంటికి మహాలక్ష్మి అని నేలకొండపల్లి యంపీడీఓ మర్రి యర్రయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామంలో ఆడపిల్లను కన్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళి అభినందించారు. స్వీట్ బాక్స్ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. మా ఇంటి మణిదీపం పేరిట జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించిన వినూత్న పథకంలో భాగంగా మండల అధికారులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆడపిల్లని నిర్లక్ష్యం చేయకుండా మగపిల్లలతో సమానంగా చదివించాలని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు, ఎంపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించరూ..!

» అధ్వానంగా గిరిజన గురుకుల పాఠశాలకు వెళ్లే రోడ్డు

వైరా, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగులో ఉన్న తెలంగాణ సంక్షేమ గిరిజన గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలకు సరైన రహదారి సౌక ర్యం లేక విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఈ గురుకులం విద్యార్థినులు వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కో నియోజకవర్గానికి గిరిజన గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ఏర్పాటులో భాగంగా కనీస సౌకర్యాలు లేని పొలాల మధ్య అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో రూ.ఐదుకోట్లతో గిరిజన బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించారు. ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఇక్కడ గిరిజన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 600మందికిపైగా విద్యార్థినులు ఉన్నారు.

వైరాకు 8కిలోమీటర్ల దూరంలో...

వైరాకు 8కిలోమీటర్ల దూరంలో ఉన్న ముసలిమడుగు రెవెన్యూ పరిధిలో ఈ గిరిజన గురుకుల భవనాలను నిర్మించారు. వైరా-మధిర, జగ్గయ్యపేట రూట్లో ఉన్న తాటిపూడి నుంచి మూడుకిలోమీటర్ల దూరంలో పొలాల మధ్య అందుబాటులో



కళాశాలకు వెళ్లే మట్టి రోడ్డు

ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈ గురుకులాన్ని ప్రారంభించారు.

ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన గిరిజన బాలికలకు ఇక్కడ ప్రవేశాన్ని కల్పించారు. తాటిపూడి నుంచి ఈ గిరిజన భవనం వరకు పూర్తిగా మట్టి రోడ్డు మాత్రమే ఉంది. అనేకసార్లు ఈ రోడ్డు అధ్వాన దుస్థితి గురించి పలు దినపత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దాంతో గత కలెక్టర్ వీపీ.గౌతమ్, అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ చొరవతో ఐటీడీఏ నుంచి రూ.20లక్షలతో ఆతర్వాత గ్రామీణ ఉపాధి హామీ కింద రూ.50లక్షలతో మెటల్ రోడ్డు నిర్మించారు. ఇది ఆర్ అండ్‌బీశాఖ పరిధిలో ఉన్నప్పటికీ రెండుసార్లు చేపట్టిన మట్టి, మెటల్ రోడ్డు నిర్మాణాలను గిరిజన ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్ శాఖలు పర్యవేక్షించాయి.

ఆర్అండ్‌బీ శాఖ మాత్రం ఈ రోడ్డు అభివృద్ధికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పం పించటానికే పరిమితమైంది. పాత ముసలిమడుగు నుంచి ఈ గిరిజన గురుకులం వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ రోడ్డు ను ఆర్అండ్‌బీ శాఖ బీటీ రోడ్డుగా నిర్మించి చేతులు దులుపుకుంది. గిరిజన గురుకులానికి కీలకంగా ఉన్న తాటిపూడి వైపు రోడ్డు అభివృద్ధిని అధికారులు విస్మరించారు. తాటిపూడి నుంచే ఎక్కువగా విద్యార్థినులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. అలాంటి ఈ మూడుకిలోమీటర్ల రోడ్డును మెటల్ రోడ్డు నిర్మాణం వరకే పరిమితం చేశారు. బీటీ రోడ్డును నిర్మించలేదు.

రోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ అధికారులు ఏడాదిన్నర కిందటే రూ.ఐదుకోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ఏడెనిమిదేళ్ల నుంచి 600మందికిపైగా విద్యార్థినులతో పొలాల మధ్యన గుంతల రోడ్డుతో ఉన్న ఈ గిరిజన గురుకులానికి సరైన రహదారి సౌకర్యం లేదు. అందువలన గిరిజన బిడ్డల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గిరిజన నియోజకవర్గమైన వైరాలో ఉన్న ఈ గిరిజన గురుకులానికి రాకపోకలు సాగించేందుకుగానూ ఆర్అండ్‌బీ పంపించిన ప్రతిపాదనల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేయాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

» సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ

వైరా, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖమ్మం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం వైరాలో జరిగిన బాలల సంరక్షణ సేవలు, మండలస్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, అక్రమనిరోధ చట్టం, లైంగిక నేరాల నుంచి బాలల సంరక్షణ చట్టం వంటి వాటి గురించి ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ బాలల సంరక్షణకు ప్రాధాన్యత నివ్వాలని స్పష్టం చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతి, ఐసీడీఎస్ మధిర సీడీపీవో బాలత్రిపురసుందరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

» జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైతుల స మస్యలను పరిష్కరిచండం లో కాంగ్రెస్ ప్రభుత్వం వి ఫలమైందని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. బోనకల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వంలో ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, నేటి ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బిల్లులకు సంబంధించి 30 శాతం కమీషన్ల గురించి కేటీఆర్ ప్రస్తావించగా, భట్టికి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడితే మంచిదని కేటీఆర్‌ను బెదిరించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం హేయకరమైన చర్యగా అభివరించారు. రైతులకు బోనస్ కూడా రావడం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం జరిగితే నాటి సీఎం కేసీఆర్ స్వయంగా రైతుల పొలాలను చూసి పరిహారాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బందం శ్రీనివాసరావు, చేబ్రోలు మల్లికార్జున్‌రావు, మోదుగుల నాగేశ్వరరావు, పారా ప్రసాద్, కొనకంచి నాగరాజు, కొమ్మినేని ఉపేంద్ర, సైదా, వంకాయలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

శానిటేషన్ డ్రైవ్

వైరా, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మునిసిపాలిటీలోని 3,5,11 వార్డుల్లో డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు, వీధుల్లో చెత్తాచెదారం తొలగించడం వంటి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

టీజీఈజేఏసీ జిల్లా కార్యదర్శిగా తిరుపతిరావు

బోనకల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యోగులకు సంబంధించిన టీజీఈజేఏసీ కమిటీ జిల్లా కార్యదర్శిగా బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడిగా పని చేస్తున్న అంతోటి తిరుపతిరావు ఎన్నిక కాబడ్డారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నూతన కమిటీలో ఆయనను ఎన్నుకున్నందుకు గానూ తోటి సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కోటమైసమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు

కారేపల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో గల కోట మైసమ్మతల్లి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభీ రామారావు, ఈవో వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.55, 463ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రత్నప్రభ, పగడాల మోహన్‌కృష్ణ, సాయి, అర్చకులు కైలాష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు తల్లాడ సొసైటీ మహాజన సభ

తల్లాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తల్లాడ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పదిగంటలకు సొసైటీ మహాజన సభ జరుగుతుందని సీఈవో నాగబాబు తెలిపారు. సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల రైతులు మహాజన సభకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇరు వర్గాల దాడులు

బోనకల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం ఇరు వర్గాల వారు పరస్పర దాడులు చేసుకున్నారు. గ్రామం నుంచి ఇరు వర్గీయులు గాయాలతో పోలీసు స్టేషన్‌కు వచ్చి కత్తి, రాళ్లతో దాడులు చేశారని ఇరు వర్గీయులు ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామానికి చెందిన పెద్దప్రోలు మురళి తాను ఆవులు తోలుకొని వస్తున్న క్రమంలో కత్తులతో దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. కొమ్మినేని రమేష్ అతని వర్గీయులు కూడా తమ పై కత్తులు, రాళ్లతో దాడులు చేశారని ఫిర్యాదు చేశారు. ఇళ్ల పై రాడ్లు, రాళ్లతో ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. స్థలానికి సంబంధించిన వివాదంతో పాటు వ్యక్తిగత కక్షల నేపథ్యంలో దాడులు చేసుకున్నట్లు తెలిసింది.

రేపు జక్కంపూడి విగ్రహావిష్కరణ

తల్లాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రాజకీయ వేత్త, తల్లాడ సొసైటీ మాజీ చైర్మన్ జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహావిష్కరణ శనివారం మండలంలోని బిల్లుపాడు జడ్పీఉన్నత పాఠశాల వద్ద జరుగుతుందని మండల కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్ తెలిపారు. గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహాన్ని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల ఆవిష్కరిస్తారని, ఈ కార్యక్రమానికి ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావు, మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారని వివరించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కల్లూరు, మార్చి27 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియంలో గురువారం ఝాన్సీ లక్ష్మీబాయి మండల స్థాయి సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ సెక్షన్ లో భాగంగా కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు పాఠశాలల నుంచి కరాటేలో నైపుణ్యం గల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి తులసి విద్యార్థులకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నివేదిత, క్రీడల నిర్వహణ కార్యదర్శి బీమా, ఫిజికల్ డైరెక్టర్ పసుపులేటి వీరరాఘవయ్య, పీఈటీలు రాధాకృష్ణ, రమాదేవి, త్రివేణి, పద్మ పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులు

ట్రైకార్ రుణాల రద్దును నిరసిస్తూ ధర్నా

బోనకల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రైకార్ రుణాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు మాట్లాడుతూ ట్రైకార్ రుణాలు అందించకుండా రద్దు చేయడాన్ని ప్ర భుత్వం విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అ ర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇచ్చి ప్రోత్సాహకాలు అందిస్తే వారి జీవనం మెరుగు పడుతుందన్నారు. ట్రైకార్‌ను రద్దు చేసి రాజీవ్ యువ వికాసం ద్వారా గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులను కూడ దరఖాస్తు చేసుకోవాలని అనడం సబబు కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది ట్రైకార్ లబ్ధిదారులు ఉన్నారని వారిని సమీకరించి వచ్చే నెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో ఆర్. రమాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు గుగులోతు నరేష్, వేణుగోపాల్, ధారావత్ నరేష్, అజ్మీరా వీరన్న, ఉపేందర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

ఆరుతడి పంటల సాగుపై అవగాహన

చింతకాని, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వరికు ప్రత్యామ్నాయంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని ఏడీఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు. మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో గురువారం రాజేందర్‌నగర్, మధిర వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండల పరిధిలోని రామకృష్ణాపురం, బస్వాపురం, రాఘవాపురం గ్రామాల్లో సుమారు 109 మంది రైతులను ఎంపిక చేసి వరి మాగాణుల్లో ఆరుతడి పంటలను సాగుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎమ్ గోవర్ధన్, సీహెచ్ ప్రగతికుమారి, రుక్మిణిదేవి, నాగస్వాతి, ఏవో మానస, ఏఈవో ఆయేషా, వినయ్, సాయిబాబు పాల్గొన్నారు.

మైక్రోఫైనాన్స్ సంస్థ ఆగడాలకు అరికట్టాలి

మధిర రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు డిమాండ్ చేశారు. మధిర ఎంప్లాయిస్ కాలనీలో కొంగల జ్యోతి అనే మహిళ మధిర పట్టణంలోని ఐరీఫ్ ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకుంది. వాయిదా చెల్లించేందుకు గడువు అడిగినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో బాధితులు సీపీఎం నాయకుల బృందానికి తమ సమస్యను వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు ఆధ్వర్యంలో నాయకుల బృందం గురువారం బాధిత మహిళ కుటుంబం వద్దకు చేరుకొని వారికి అండగా నిలిచారు. సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నా కానీ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తేలప్రోలు రాధాకృష్ణ, వడ్రాణపు మధు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ ఆశయాలు సాధించాలి

కల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని ఇండిపెండెంట్ అసోసియేషన్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్ అన్నారు. గురువారం సెంటినరీ బాపిస్ట్ చర్చి సికింద్రాబాద్‌లో పాస్టర్ ప్రవీణ్ మృతదేహం వద్ద ఆయనతో పాటు టీయూసీపీఏ జనరల్ సెక్రటరీ గోనే సాల్మన్ రాజులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎనోష్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జూన్2 లోపు యూనిఫాం సిద్ధం

● సత్తుపల్లి ఎంఈవో నక్కా రాజేశ్వరరావు

సత్తుపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాం పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు సత్తుపల్లి ఎంఈవో నక్కా రాజేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో పట్టణంలోని విద్యార్థులకు యూనిఫాం స్టిచ్చింగ్ నిమిత్తం మెప్మా అధికారులకు పంపిణీ చేశారు. మే 20వ తేదీకల్లా అందజేసే క్రమంలో పట్టణంలోని 1580మంది, మండలంలో 1806మంది విద్యార్థుల కోసం యూనిఫాం క్లాత్‌ను ముందుగానే అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పూరేటి యాకోబు, శైలకుమారి, నీరుడు నాగేశ్వరరావు, కృష్ణారావు, రత్నరాజు, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సత్తుపల్లిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలలు కావస్తున్నా ఇచ్చిన వాగ్దానాల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గంటా శ్రీను, అమర్లపూడి శరత్‌లు ఆరోపించారు. గురువారం జిల్లా కమిటీ పిలుపుమేరకు పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గు నాగిరెడ్డి, కందిమళ్ల ప్రసాద్, సున్నం కృష్ణ, రాజారావు, నెక్కొండ అలివేలు, సురేష్, రామచంద్రరావు, హనుమంతరావు పాల్గొన్నారు.



కారేపల్లిలో...

వైరాలో...

వైరా: అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులివ్వాలని, బోదకాల బాధితులను దివ్యాంగులుగా గుర్తించి నెలకు రూ.పదివేల పింఛన్ ఇవ్వాలని కోరుతూ సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు ఒక వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం ప్రకటనలు చేయటానికే పరిమితమవుతుందని, కొత్త రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు ఇవ్వడం లేదని ఆపార్టీ డివిజన్ నాయకుడు కె.అర్జున్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యలదండి బాబు, నాయకులు హన్మంతరావు, కన్నెగంటి నవీన్ తదితరులున్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం మండల సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు గుమ్మడి సందీప్, ఎస్వీ రాకేష్ డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి, వీరన్న, కొయ్య లక్ష్మీను, తాటి పాపారావు, చల్లా రాజు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ధర్నా చేస్తున్న నాయకులు

తల్లాడలో...

తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ-ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం తల్లాడ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానుద్దేశించి ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.లాల్‌మియా మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డి.శ్రీనివాసరావు, షేక్.జానీ, గొడ్ల పుల్లమ్మ, డి.రమణ, నాగూల్‌మీరా, వెంకటేశ్వర్లు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మధిరటౌన్, మార్చి27(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మధిరలోని షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దార్ రాంబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు షేక్ ముజాహిద్, షేక్ హుస్సేన్, గౌసుద్దిన్, నాగుల్‌మీర, జమీర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాను అందజేస్తున్న తహసీల్దార్ రాంబాబు

ముదిగొండలో...

ముదిగొండ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేయనున్న ఇఫ్తార్‌విందుకు రూ.50వేల నగదును గురువారం తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ ముస్లిం మతపెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇఫ్తార్‌విందు నిర్వహణకు ప్రభుత్వం రూ.50వేలను అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వహీదాబేగం, ముస్లిం మైనార్టీ నాయకులు అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న తహసీల్దార్

బోనకల్‌లో..

బోనకల్: రంజాన్ పండుగకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ పున్నం చందర్ ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి కేటాయించిన రూ. 50వేల నగదును వారికి ఇచ్చారు. ఈ సమావేశంలో చాంద్ పాషా, జానిమీయా, దస్తగిరి, మదార్ సాహెబ్, బాబు, గఫూర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి: బీజేపీ

సత్తుపల్లిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశుధ్యం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కే.నర్సింహను గురువారం స్థానిక కార్యాలయంలో కలిసి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 23వార్డులలో అపరిశుభ్రత నెలకొని ఉందని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బాణోతు విజయ్, సుదర్శన్‌మిశ్రా, జొన్నలగడ్డ నరేష్, ఆచంట నాగస్వామి, మందా శివ, శేషగిరి, కార్తీక్, సాలి శివ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు

సత్తుపల్లిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లను సత్తుపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో మందపాటి వాసురెడ్డి, వేల్పుల కళావతి, కంచర్ల రమాదేవి, సాధు ఉదయలక్ష్మి, మందపాటి సరస్వతి, భేతిని శ్రీనివాసరావు, దేశిరెడ్డి రంగారెడ్డి, పూచి చిలకమ్మ, దుగ్గిరాల వాణి, విజయ ఉన్నారు.

తల్లాడలో...

తల్లాడ: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావును గురువారం తల్లాడ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

చింతకానిలో..

చింతకాని: మండల పరిధిలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను చింతకాని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేపట్టారు. అరెస్టయిన వారిలో లచ్చగూడెం, మత్కేపల్లి మాజీ సర్పంచ్‌లు గురిజాల ఝాన్సీ, కొండలరావు ఉన్నారు.

బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌పై ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాజం, పాస్టర్లను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన బీజేపీ నాయకుడు పాలకొల్లు శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి పట్టణ సీఐకు ఎస్‌సీసీ, ప్యాట్ బాధ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పాస్టర్ ప్రవీణ్ మృతికి నివాళులర్పించగా, మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో అలవాల కరుణాకర్, సామేలు, వరప్రసాద్, పలువురు పాస్టర్లు, సభ్యులు ఉన్నారు. అయితే ఇదే విషయమై పట్టణ సీఐ కిరణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని, పరిశీలనలో ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న భార్యను ఇంటికి తీసుకెళ్లేందుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లికి చెందిన మట్ట వెంకటేశ్వరరావు (35), భార్య భవానీ సత్తుపల్లిలోని జీవీ మాల్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి ఆమెను ఇంటికి తీసుకెళ్లేందుకు సత్తుపల్లికి వస్తుండగా శివారులో ఓ పానీపూరి బండిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.